# ఉపవాస ప్రార్ధన ప్రాముఖ్యత

1. మనస్సు నిలిపి ప్రభువును సేవించుటకు ఉపవాస ప్రార్ధన చాలా అవసరము. వారు ప్రభువును సేవించుచు ఉపవాసము చేయుచుండగా పరిశుద్ధాత్మ - నేను బర్నబాను సౌలును పిలిచిన పనికొరకు వారిని నాకు ప్రత్యేక పరచుడని వారితో చెప్పెను. అపో. కార్య 13:2-3

2. విశ్వాసాభివృధి పొందుటకు ఉపవాస ప్రార్ధన ఎంతో అవసరము.శిష్యులు అల్ప విశ్వాసము వలన దయ్యము పట్టినవానిని విడిపించలేకపోయిరి. ఆసందర్భములో ప్రభువు - ప్రార్ధన విశ్వాసము వలన మీకు అసాధ్యమైనది ఏదియు ఉండదని చెప్పెను. మత్తయి 17:19-21

3. ఏమి తిందుమా అన్న ధ్యాస వదలి కుటుంబ విషయములను కొంతకాలము మరచి, సావకాశముగా ప్రార్ధనలో నిలిచియుండుటకు ఉపవాస ప్రార్ధన అవసరము. 1 కోరంధీ 7:5

4. ఆత్మనుసారముగా జీవించుటకు, ఆత్మ చేత శరీర క్రియలను చంపు శక్తిని పొందుటకు ఉపవాస ప్రార్ధన అవసరము. రోమా 8:13

5. ఉపవాస ప్రార్ధనలో కనిపెట్టుట ద్వారా దేవుని వాగ్దానాలను పొందుటకు, ఆ వాగ్దానాల నెరవేర్పు కొరకైన విశ్వాసము సంపాదించుకొనుటకు ఉపవాస ప్రార్ధన అవసరము. "ఎవడైనను ఈ కొండను చూచి -నీవు ఎత్తబడి సముద్రములో పడువేయబడుమని చెప్పి,తన మనస్సులో సందేహింపక తాను చెప్పునది జరుగునని నమ్మినయెడల వాడు చెప్పినది జరుగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. అందుచేత ప్రార్ధన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామనినమ్ముడి, అప్పుడు అవి మీకు కలుగునవి మీతో చెప్పుచున్నాను.(మార్కు 11:23,24)"

6. వ్యాధులను స్వస్థపరచుటకు, దయ్యములను వెల్లగొట్టుటకు, విరిగిన హృదయాలు కట్టబడుటకు, బానిసైపోయిన అలవాట్లు నుండి విడుదల పొందుటకు అనగా అసాధ్యాలను సుసాధ్యాలుగా చేయుటకు ఉపవాస ప్రార్ధన అవసరము "ఆయన శిష్యులు -మేమెందుకు ఆ దయ్యమును వెల్లగొట్టలేక పోతిమని ఏకాంతమున అయన నడిగిరి.

అందుకాయన - ప్రార్ధన వలననే గాని మరి దేనివలనైనను ఈ విధమైనది వదలిపోవుట అసాధ్యమని వారితో చెప్పెను ."(మార్కు 9:28,29)

7. ఆత్మలను సంపాదించుటకు ఉపవాస ప్రార్ధన అవసరము. అసలు ఆత్మలు సంపాదించాలి, ఆత్మలు రక్షించబడాలి, దేవుని రాజ్యము కట్టబడాలి అనే హృదయ వాంఛ లేకుండా చేసే ఉపవాస ప్రార్ధన వాక్యానుసారమైన ప్రార్ధన కాదు. ఆసక్తితో కూడిన విజ్ఞాపన ప్రార్ధన సాతాను బంధకములలో ఉన్న ఆత్మలను విడిపించి, రక్షించుటకు సహాయపడును. (మార్కు 1:17,గలతి4:19)

Source: Pas Abhisheck

8. పరిశుద్ధాత్మతో నింపబడుటకు, ప్రార్ధనలో కనిపెట్టుటకు ఉపవాస ప్రార్ధన అవసరము ప్రార్ధనలో కొనసాగుట వలన పరిశుద్ధాత్మను కలిగియుందుము. పరిశుద్ధాత్ముని శక్తి నీలో ప్రవహించుట ద్వారా,పరిశుద్ధాత్ముడు తన వరములతో నిన్ను నింపి వాడుకొనును. ఉపవాస ప్రార్ధనలలో ఉండుట ద్వారా ఆధ్యాత్మిక జీవితములో వర్ధిల్లుటకు, శోధనలో పడుకుండుటకు కాపాడబడదురు.(అపో.కార్య. 1:8)

9. దేవుడు తన ప్రజలకు ఇచ్చిన శక్తివంతమైన కవచము ప్రార్ధన -ఉపవాసము. ఉపవాస ప్రార్ధనలో నిలిచియుండుట ధ్వారా వ్యాధులు, దయ్యములు, చికటి శక్తులు మీద విజయం కలుగును. "సిలువ ద్వారా జయమును పొందుదుము. అయన ప్రధానులను అధికారులను నిరాయుధులనుగా చేసి సిలువ చేత జయోత్సవముతో వారిని పట్టి తెచ్చి బాహటముగా వేడుకకు కనుపరచెను." [కొలొస్స 2:15]

10. ఉపవాస ప్రార్ధనలో అన్నిటికంటే ముఖ్యముగా నిన్ను నీవు తెలుసుకొనుటకు, నీ బలహీనతలుఎరుగుటకు సహాయపడును. నీ ప్రేమహీనతను, భాధ్యతారాహిత్యమును బయలుపరచును. అంతేగాక, ఉపవాస ప్రార్ధన నీ ఆత్మను ఉజ్జీవింపజేశి, నీ మనస్సును సిద్ధపరచి నీకు స్వస్థతను అనుగ్రహించును. గనుక ఒక వ్యక్తి భక్తిని, శక్తిని సంపాదించుకొనుటకు ఉపవాస ప్రార్ధన ఎంతో అవసరము ! ( కీర్తన 85:6)

**బైబిలులో కొంతమంది ఉపవాస ప్రార్ధనలు చేసి దేవుని శక్తిని, దయను, క్షమాపణను పొందుకున్నట్లుగా వారి అవసరతలు తీర్చుకొన్నట్లుగా మనకు కనబడుతుంది.**

1. * నెహెమ్యా ఉపవాస ప్రార్ధన చేసి దేవుని దయను, శక్తిని పొందుకుని యెరూషలేము ప్రాకారము కట్టాడు (నెహెమ్యా 1:4; 6:15)

2 * ఎజ్రా కాలములో కొంతమంది ఉపవాస ప్రార్ధన చేసి దేవుని కాపుదలను పొందుకున్నారు (ఎజ్రా 8:21-23)

3 * హన్నా ఉపవాస ప్రార్ధన చేసి కుమారుడును పొందుకొంది (1 సమూ 1:1-20) 4 * దానియేలు యెరూషలేము పట్టణము నిమిత్తం ప్రార్ధన చేయగా " దేవుడు తన దూతను పంపి " మరి యెరూషలేము పట్టణము భవిష్యత్తును తెలియజేసాడు (దానియేలు9 వ అధ్యాయము)

5 * నీనెవె పట్టణస్థులు ఉపవాస ప్రార్ధన చేసి దేవుని శాపం నుండి తప్పించుకున్నారు (యోనా 3:5-10)

6 * మోషే ఉపవాస ప్రార్ధన చేసినప్పుడు దేవుడు ఇశ్రాయేలీయుల జనాంగం మీద తన కోపంను త్రిప్పుకున్నాడు (ద్వితీ 9:17-19; నిర్గమ 32:10-32)

7* సమూయేలు కాలంలో ఇశ్రాయేలీయులు ఉపవాసముండి దేవుని తట్టు తిరిగినప్పుడు దేవుడు వారి పాపములను క్షమించి ఫిలిష్తీయుల నుండి వారిని విడిపించాడు (1 సమూ 7:3-17)

Source: Pas Abhisheck

8 * యెరూషలేముకు ప్రయాణిస్తున్న ప్రజలు దేవుని సహాయాన్ని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారని చూపించడానికి ఉపవాసం ఉన్నారు. (ఎజ్రా 8: 21-23) 9 * పౌలు, బర్నబాలు సంఘంలో పెద్దల్ని నియమించేటప్పుడు కొన్నిసార్లు ఉపవాసం ఉన్నారు. (అపొ 14:23)

10* బాప్తిస్మం తర్వాత, యేసు తాను చేయబోయే పరిచర్య అంతటిలో దేవుని ఇష్టాన్ని నెరవేర్చేలా తనను తాను సిద్ధం చేసుకోవడానికి ఉపవాసం ఉన్నారు. (లూకా 4:1, 2)

ఈ విధంగా ఉపవాస ప్రార్థనల ద్వారా దేవుని దయను, శక్తిని, ఆయన ప్రణాళికను, సంతానంను మరియు యుద్ధంలో విజయాన్ని పొందుకున్నారు. కొంతమంది ఉపవాస ప్రార్థనల ద్వారా దేవుని క్షమాపణ పొంది శాపము నుండి కీడు నుండి విడిపింపబడ్డారు. కనుక ఉపవాస ప్రార్థన దేవుని హృదయాన్ని కదలించగలదు. దేవుని కోపాన్ని కూడా త్రిప్పగలదు.

[ఇప్పుడైనను మీరు ఉపవాసముండి కన్నీరు విడుచుచు దుఃఖించుచు మనఃపూర్వకముగా తిరిగి నాయొద్దకు రండి. ఇదే యెహోవా వాక్కు. మీ దేవుడైన యెహోవా కరుణావాత్సల్యములు గలవాడును, శాంతమూర్తియు అత్యంత కృపగలవాడునై యుండి, తానుచేయనుద్దేశించిన కీడును చేయక పశ్చాత్తాపపడును గనుక మీ వస్త్రములను కాక మీ హృదయములను చింపుకొని ఆయనతట్టు తిరుగుడి. ఒకవేళ ఆయన మనస్సు త్రిప్పుకొని పశ్చాత్తాపపడి మీ దేవుడైన యెహోవాకు తగిన నైవేద్యమును పానార్పణమును మీకు దీవెనగా అనుగ్రహించును; అనుగ్రహింపడని యెవడు చెప్పగలడు? ] (యోవేలు 2:12-14)

శిష్యులు మార్కు తొమ్మిదవ అధ్యాయములో ఉన్న వ్యక్తికీ, సహాయము చెయ్యలేకపోయారు. వాడు దెయ్యలతో బంధీ అయ్యాడు. ఆ బాలుడు దెయ్యాల అదుపులో ఉన్నాడు. "వాయు మండల సంబంధమైన అధిపతి, అనగా అవిదేయులైన వారిని ఇప్పుడు ప్రేరేపించు శక్తికి అధిపతి" (ఎఫెస్సీయులకు 2:2). ఈ యవనస్తుడు దెయ్యము పట్టినవాడే. శిష్యులు అతనికి సహాయము చెయ్యడానికి శక్తి హీనులయి పోయారు. "ఆయన ఇంటిలోనికి వెళ్ళిన తరువాత, ఆయన శిష్యులు మేమెందుకు ఆ దయ్యమును వెళ్ళ గొట్టలేక పోతిమని, ఏకాంతమున ఆయనను అడిగిరి? అందుకాయన, ఉపవాస ప్రార్ధన వలననేగాని, మరిదేని వలననైనను ఈ విధమైనది వదిలి పోవుట అసాధ్యమని వారితో చెప్పెను" (మార్కు 9:28, 29).

ప్రియులారా.... ఉపవాస ప్రార్ధన చాలా శక్తి కలది. దేవుడు ఈ రోజు తన శిష్యులకే కాదు, మన అందరికి చెప్తున్న మాట "ఉపవాస ప్రార్ధన". నీ జీవుతాములో ఉన్న శోధనలు, ఇబ్బందులు, కష్టాలు, శ్రమలు, నిందలు అన్ని తొలగిపోవాలి అంటే ఈ రోజే ఉపవాసముండి ప్రార్ధన చెయ్యి. దేవుడు నీ జీవితములో గొప్ప కార్యాలు చేయడానికి సిద్ధముగా ఉన్నాడు. దేవుడు మిమ్ము దివించు గాక! ఆమెన్!!!

.

Source: Pas Abhisheck